# పెద్దమ్మ

రచన: బి. సక్కుబాయి

సాయంకాలము నవతను కాఫీకి పిలిచి పిలిచి, విసుగెత్తిన సునీతమ్మ విసురుగా గదిలోకి వెళ్ళింది. ఒక ఫోటోను తన హృదయానికి హత్తుక్కొని కళ్ళు మూసుకుని కూర్చుంది. నవత. ఏ ఊహాలోకములో విహరిస్తున్నదో.

ఆశ్చర్యంగా కూతురుకి దగ్గరగావెళ్ళి, ఎవరి ఫోటో? "అంటూ నవత చేతులలోనుండి తీసుకున్నది, ఊహాలోకమునుండి ఉలిక్కిపడి లేచిన నవత ఆ ఫోటో ఇచ్చేయ్ పెద్దమ్మా" అన్నది కంగారుగా.

ఫోటోను చూచిన సునీతమ్మ ఆపాదమస్తకము వణకిపోయింది యువకుని ఫోటో అందంగా ఉంది.

"నవతా ఈ ఫోటో ఎవరిదీ? అంటూ ప్రశ్నించింది. కానీ నవత సమాధాన మివ్వలేదు. అప్పుడే గదిలోకి వచ్చిన ప్రవీణ్. ఫోటోను చూచి ఉగ్రుడై, పెద్దమ్మా ఎవరి ఫోటో అంటే దానికి చెప్పటానికి ముఖం చెల్లవద్దు. దాని "బాయ్ ఫ్రెండు" అయిఉంటాడు, మనము చదువులకు పంపితే వాళ్ళు చేసే ఘనకార్యాలు ఇవి.

"ఒరేయ్ ప్రవీణ్, నీవు ఊరోక్కరా! చిన్నది తెలియక ఎదైన తప్పుచేసిన సరిదిద్దాలి గాని, అలా మండిపడ్తారట్రా! మీ అమ్మకీలాగే ఉండేది కోపము" అన్నది సునీతమ్మ.

"అమ్మ అదృష్టవంతురాలు, పెద్దమ్మా అందుకే అమ్మ ఇవేమీచూడకుండా కన్నుమూసింది. నాన్న దేశాలుపట్టాడు" అన్నాడు గాద్గదికంగా.

ప్రవీణ్ మాటలువిని ఆమె వదనము విషాద పూరితమైనది. "ఇప్పుడేమి జరిగిందని అంతబాధ. అసలు విషయమేమిటో తెలుసుకోకుండానే కంగారు పడ్తున్నావేమిరా? అన్నది.

అప్పుడే దీనికి ప్రేమా–పెళ్ళినా! నా మనస్సెంత వికలమైపోయిందో నీకు తెలియదు, పెద్దమ్మా.

అవును బాబూ జీవితంలో ధ్యేయంలేకపోతే గాలికెగిరే ఆకుల్లా అయిపోతాం. నా జీవితములో ఉన్నది ఒక్కటే కోరిక బాబూ. నీవు డాక్టరి పూర్తి చేయాలి. నవత డాక్టరవాలి మీరు వృద్ధిలోకి రావాలి. నా జీవితాశయము ఇది బాబూ అన్నది.

'నీకోరికను తప్పక నెరవేరుస్తాను పెద్దమ్మా' అన్నాడు ప్రవీణ్. నవత మాత్రము తలదించుకొని కూర్చుంది. నవతకై సాలోచనగా చూచిన సునీతమ్మ తలపంకించి "నవతా, ప్రేమించుకున్న వారు ఎంత సుఖమయ జీవనము కొనసాగిస్తారో వారి జీవితాలెలా మలుపు తిరుగుతాయో, వాళ్ళ వివాహాలు ఎంతవరకు విజయవంతమౌతాయో తెలియజేయుటకు నీ కొక కధ చెప్తాను, వింటావా?' అన్నది.

"కథలన్నీ నిజాలు నిజాలన్నీ కథలు కావు పెద్దమ్మా అన్నది.

"నేను చెప్పబోయేది వాస్తవమైన కథ"

"దానికి నిదర్శన మేమిటి పెద్దమ్మా?"

"నిదర్శనము కావాలా? దానికి నిదర్శనము నీవు. ప్రవీణ్" అన్నది.

"పెద్దమ్మా" అని ఇద్దరూ ఒకేసారి అన్నారు.

"ఔను బాబూ. నేను చెప్పబోయె కథకు మీరిద్దరు నిదర్శనాలు. నేను ఇన్నాళ్ళు మీ పసిహృదయాలను గాయపర్చడము ఇష్టములేక ఈ రహస్యాన్ని దాచాను, కాని ఈనాడు చెప్పక తప్పదు. మీ అమ్మ జీవిత చరిత్ర నవతను మార్చగలదేమో" అన్నది గంభీరముగా.

ప్రవీణ్ ముఖము పాలిపోయింది. "అమ్మ జీవిత చరిత్ర ఏమిటి? పెద్దమ్మా" అన్నాడు ఆందోళనగా.

"నేను మీకేమౌతాను? అన్నది సునీతమ్మ, ఇద్దరి నుద్దేశించి.

"పెద్దమ్మ" అన్నాడు ప్రవీణ్.

"అంటే?"

"అంటే, మా అమ్మకు అక్కవి. నీవు, మా అమ్మ స్వంత అక్కచెల్లెండ్రు." అన్నది నవత.

"నేను మీఅమ్మకు అక్కయ్యనే కాని స్వంత అక్కయ్యను మాత్రముకాదు. నేను మీ సవతి తల్లిని అన్నది సునీతమ్మ. ఈమాటతో వారి గొంతు పూడుకు పోయింది.

నవత అచేతనురాలైనది.

"నీవు మా సవతితల్లివా పెద్దమ్మా. అంటూ ఆపాదమస్తకము వణికిపోయాడు ప్రవీణ్.

"ఏమిటి బాబూ, స వ తి త ల్లి అంటే అంత భయమా? అలావణికిపోయావు? అన్నది సునీతమ్మ.

"భయముకాదు పెద్దమ్మా. ప్రపంచములో కని విని ఎరుగని విషయము సవతితల్లి తన సవతి పిల్లలను ఉద్యోగముచేసి పోషిస్తుందా? తన స్వంత పిల్లలకంటే అధికముగా ప్రేమిస్తుందా ? నీ దెంత విశాల హృదయమమ్మా" అన్నాడు ప్రవీణ్ కంపిత స్వరముతో.

సవతి తల్లికి మాతృత్వమనేది ఉండదా ? నా భర్త రక్తాన్ని పంచుకుని పుట్టిన పిల్లలు నా పిల్లలు కారా? మీరు వృద్ధిలోనికి వచ్చిననాడే నాకోరిక ఫలిస్తుంది. మీఅమ్మ ఆత్మకు శాంతి లభిస్తుంది" అన్నది.

"పెద్దమ్మా, మామయ్య మాఅమ్మకు సొంత అన్నయేనా?" అన్నది. నవత కన్నీరు తుడుచుకుంటూ.

"కాదమ్మా, మీ మామయ్య నా స్వంత అన్నయ్య" అన్నదావిడ.

నేను సొంత చెల్లెలినైనా మీ అమ్మనే తన సొంత చెల్లెలిగా చూచేవాడు అన్నయ్య". తన ముద్దుల చెల్లెలి పిల్లలని మమ్ములను ఇంత ఇదిగా చూస్తాడు" అన్నారు.

"ఇదంతా మా అదృష్టము పెద్దమ్మా, ఇంత విశాలమైన హృదయాలు కల్గిన మీరు దేవతలు" అన్నాడు ప్రవీణ్.

"మా అమ్మ జీవిత చరిత్రేమిటో చెప్పు పెద్దమ్మా," అన్నది నవత. ప్రవీణ్ పెద్దతల్లి ముఖము లోకి కుతూహలముగా చూచాడు.

"చెప్తానర్రా చెప్తాను. వాళ్ళ తల్లిజీవిత చరిత్ర వినాలని నిశ్శబ్దముగాకూర్చున్నారు. ప్రవీణ్,నవతలు

"అమ్మ నాన్నలకు నేను, అన్నయ్య ఇద్దరమే సంతానము నేను ఇంటరులో నుండగా నాన్నగారు నా పెండ్లి ప్రయత్నాలు కొనసాగించారు. అన్నయ్య స్నేహితుడు డాక్టరు విపిన్ తరచు మా యింటికి వచ్చేవారు. ప్రథమ వీక్షణాలలోనే నేను వారిని ప్రేమించాను. ఈ విషయము అన్నయ్యకు తెలియజేశాను. నా అదృష్టవశాత్తు వారు నన్ను వివాహము చేసుకొనుటకు అంగీకరించారు. పెద్దల సమక్షములో మా వివాహము వైభవముగా జరిగింది.

మేము అన్యోన్యతకు అనురాగానికి మారు పేర్లుగా ఉండేవాళ్ళము. మాది ఆదర్శదాంపత్యమని నల్గురు మెచ్చుకున్నా సంతోషముచేతఉప్పొంగిపోయే దాన్ని. వారు నన్ను ఒక్క క్షణముకూడా విడిచి ఉండలేకపోయేవారు. మాప్రేమ జీవితాంతము ఈ విధముగానే ఉండాలని భగవంతుని ప్రార్థించేదానిని.

మా అత్తగారు వారి చిన్ననాటనే స్వర్గస్తులయ్యారు. వారిఫోటో దగ్గరగా వెళ్ళి అమ్మా "దైవసమానమైన భర్తను నాకు ప్రసాదించావు. నీవు దయామయివి తల్లీ. నేను వారి ప్రేమకెన్నడూ దూరముకానట్లు ఆశీర్వదించు తల్లీ." అని చేతులు జోడించేదాన్ని.

నా పెండ్లియైన సంవత్సరానికే నా జీవితము మలుపుతిరిగింది.

వారెప్పుడు 'సరితా, సరితా,' అని పలువరించేవారు. నాపేరుకు బదులుగా సరితా" అంటూ నన్ను పిలిచేవారు.

"ఏమిటండీ మీ నర్సు పేరు అంత మధురముగా ఉన్నదా? నన్ను సహితము సరితా, సరితాఅని పిలుస్తారు" అన్నాను.

"కలిసి మెలసి ఒకేచోట పనిచేస్తాము కదా. అందుకే త్వరగా నోటికి ఆపేరు వచ్చేస్తుంది." అన్నారు నచ్చచెప్పుతున్నట్టుగా.

ఓరోజు సరితను ఇంటికి తీసుకొనివచ్చి పరిచయము చేశారు. సరిత అందముగా ఉండేది. ఆనాటి నుండి ఆ అమ్మాయి తరచు ఇంటికి వచ్చేది. వారితో చాల చనువుగా ప్రవర్తించేది. నాకు బాధ వేసేది.

రాను రాను నాలో సహనము సన్నగిల్లినది. "మాటి మాటికి ఆవిడ మన యింటికి ఎందుకు వస్తుంది?" అన్నాను తీవ్రముగా.

వారు నా ముఖములోనికి అలాగే చూస్తూఉండిపోయారు. తర్వాత ఆవిడ నన్ను ప్రేమించిందట-నన్ను చూచుటకు వస్తుంది. చూచివెళ్లినంత మాత్రాన నీకు వచ్చిన నష్టమేమిలేదుగదా?" అన్నారు.

వారి మాటలతో నాఅభిమానము దెబ్బతిన్నది నష్టమెందుకుకాదో అడుగుదామనుకున్నాను. కానిప్రతి విషయమునకు వాదించడము పోట్లాడడము చేసి ఇల్లు నరకముగా చేయడము నాకిష్టము లేకపోయింది. సరిత ఇంటికి వచ్చినా పట్టించుకోకుండా ఉండేదాన్ని.

వారెంత బాగుగా చూచినా కూడా నాకేమిటో వెలితిగానే ఉంటుంది. ఏదో తెలియనిబాధ, దిగులు, నన్ను ఆవరించుకున్నవి.

ఓనాడు "సరితను నేను ప్రేమించాను. పెండ్లి చేసుకోవాలని అనుకుంటున్నాను. నీకేమైనా అభ్యంతరమా? అని ప్రశ్నించారు.

నా హృదయాన్ని ఎవరో పిండిచేసినట్లుగా ఫీలయ్యాను. నాతలపై పిడుగుపడినట్లుయైనది. వారేదైనా అన్నారంటే చేసి తీరుతారు. భార్య బ్రతికిఉండగనే మరి ఒకరిని ప్రేమించడము పైగా పెండ్లి చేసుకుంటాను నీకేమైన అభ్యంతరమా" అని ప్రశ్నించడము సమాధానమివ్వకుండా నాగదిలోకి వెళ్ళాను. నా జీవితములో మొదటి సారిగా విపరీతముగా విలపించాను.

మరునాడు సరిత ఇంటికి వెళ్ళాను. ఎంతో ఆప్యాయముగా మాట్లాడింది. కాని నాలో అగ్నిజ్వాలలు రగులుకుంటున్నవి. నాలోని కోపము కట్టలు త్రెంచుకున్నది.

"సాఫీగా సాగిపోతున్న నా జీవితములో చిచ్చురగుల్చుటకు వచ్చావా? పచ్చని కాపురములో నిప్పులు పోశావు. నీకృత్రిమ వలపులతో వారిని వలలోవేసుకుని నా స్థానాన్ని ఆక్రమించాలి అనుకుంటున్నావు. ఛీ నీవు స్త్రీ వేనా? నీకు హృదయమున్నదా? నాస్థానములో నీవేఉంటేఏమి చేసేదానివి" అన్నాను కోపముగా.

కోపములో నానామాటలన్నాను. కాని ఏఒక్కదానికి జవాబు ఇవ్వలేదు. ఏడుస్తూ కూర్చుండిపోయింది.

''వెళ్తున్నాను'' అన్నాను లేచి నిల్చోని.

"కూర్చోండి, మీతో మాట్లాడాలి" అన్నది. నేను కూర్చున్నాను. తలుపు దగ్గిరగావేసి వచ్చి నా చెంత కూర్చున్నది.

''చూడండీ, నేను మీకు అన్యాయము చేయాలనే ఉద్దేశము నాకేనాడులేదు. మీరు స్త్రీయై కూడా మరొక స్త్రీని గురించి ఇంతనీచముగా ఎలాఊహించ గల్గుతున్నారో అర్థము కావటములేదు. స్త్రీ తనకు తాను తన ప్రేమను వ్యక్తము చేయలేదు. పురుషుడి ప్రమేయములేకుండా స్త్రీ ముందడుగు వేయదు.

నేను వారిని ప్రేమించిన మాట వాస్తవమే. వారు నన్ను వలచి వలపించుకున్నారు. వారి పెండ్లి ఐనదని నాకు తెలియదు. వారు చెప్పలేదు. పెండ్లి ఐనదని చూచాయగా తెలిసిననాడు నేను వారినడిగాను కాలేదని చెప్పారు. నిజమేనని నమ్మాను. నేను వారిని విడిచి ఉండలేని స్థితికి తెచ్చాక వారి పెండ్లి ఐనట్లు తెలియజేశారు.

నేను మీయింటికి రావడము నాకేమాత్రము ఇష్టములేదు. కాని వారి మనస్సు నొప్పించలేక నా అభిమానాన్ని చంపుకుని వస్తాను. వారి మాటను కాదన్న ఎంతో నొచ్చుకుంటారు. "నాజీవితమే ఈలాటిది, అందరివలె నేను అదృష్టవంతుడినైనా, పుట్టిన క్షణమే తల్లిని పోగొట్టుకునే వాణ్ణి కాదు" అని నొచ్చుకుంటారు.

తల్లిలేని బాధ ఎలాంటిదో నాకు బాగా తెలుసు. చిన్ననాటనే తల్లినికోల్పోయిన నేను సవతితల్లిచేతిలో పెరిగి పెద్దదాననయ్యాను. అలాంటి పరిస్థితిలో వారి ప్రేమ ఆదరణ నాకు అమృతతుల్యమైనది. వారి ప్రేమలో నన్ను నేను మర్చిపోయేదాన్ని. కాని ఇప్పుడు వారి ప్రేమను అనురాగాన్ని నిండుమనస్సుతో స్వీకరించలేను. వారి ప్రేమానుభావాలు స్వీకరించేది నీవుకావు. వేరొకరుఅని నాఅంతరాత్మ నన్ను హెచ్చరిస్తూనే ఉంటుంది. కాని నేను వారిమనస్సు నొప్పించి ఏవిషయము బహిర్గతము చేయలేను.

వారు మీకెంతో నాకు అంతే. అంతమాత్రాన నా స్వార్థాన్ని చూచుకుని మీకు అన్యాయము తలపెట్టను. "మీ స్థానాన్ని సడలించను. నా మాట నమ్మండి'' అంది ఏడుస్తూ.

తృప్తిగా నిట్టూరుస్తూ ఇంటికి వచ్చేశాను. కాని ఇంటిలో అడుగిడగానే నామనస్సు కృంగిపోయింది. సరితఏడుపే నాచెవులలో గింగురుమంటున్నది. నాలో అశాంతి బయలుదేరింది.

తప్పు వారిమూలముగా జరిగింది. శిక్ష ఆమె అనుభవిస్తుంది. సరిత ఇంకెవరినైనా పెండ్లాడుతుందని నాకనిపించలేదు. అటువంటప్పుడు తను జీవితాంతము శిక్ష అనుభవించాలి. సరిత కన్నీళ్ళు నా జీవితాన్ని ప్రళయంలా చుట్టుముట్టునేమో. నాభర్త చేసిన పొరపాటుకు సరిదిద్దడము నావిధి. సరిత లేనిది వారు సుఖముగా ఉండలేరు. నాకు కావలసినది వారి సుఖశాంతులే. సరిత జీవితము అన్యాయము కాకుండా చూడాలి. ఈ ఆలోచనతో నామనస్సు తేలికపడినది.

సరితను ఒప్పించి నా చేతులమీదుగా వారిద్దరి వివాహము జరిపించాను. సరితే మీఅమ్మ అన్నది సునీతమ్మ.

"అమ్మచేసిన పొరపాటువల్ల, నీజీవితానికి తీరని అన్యాయమే జరిగినది పెద్దమ్మా. అన్నది నవత.

"మీ అమ్మ ఏమిపొరపాటు చేయలేదు నవతా! దాని నుదుట అలా వ్రాసిపెట్టి ఉన్నది. అలాజరిగినది' అన్నారు.

"తర్వాత ఏమి జరిగినది పెద్దమ్మా. అన్నాడు ప్రవీణ్ ఆతృతగా.

సునీతమ్మ మళ్ళీ చెప్పటం ప్రారంభించారు.

"చెప్తున్నాను బాబూ. మీ అమ్మ ఉద్యోగము మానేసింది. నేను మీ అమ్మ స్వంత అక్కచెల్లెండ్రులా కలసి మెలసి ఉండెవాళ్ళము. అన్నయ్యకు మీ అమ్మంటే పంచప్రాణము. నన్ను తీసుకు

వెళ్ళకపోయినకూడా మి అమ్మను మాత్రము ప్రతి పండుగకి తీసుకునివెళ్ళి బట్టలు పెట్టి పంపేవారు. తోబుట్టువులేని సరితవు అన్నయ్య అంటే ఎనలేని ప్రేమాభిమానాలు.

సరిత వారు ఎంతో ఆనందంగా కాలక్షేపము చేసేవారు. మి అమ్మ నెంతో ప్రేమగా చూచుకొనేవారు. అలాగని నన్నెప్పుడు తక్కువగా చూడలేదు.

ఒక్కోసారి వారిద్దరి ప్రేమను చూచి నాకు బాధ కలిగేది. నేనే వీళ్ళ పెండ్లి జరిపించకపోయిన వారింత సుఖముగా ఉండేవాళ్ళ అని అనుకొనేదాన్ని. మళ్ళీ నాపై నాకే అసహ్యమువేసేది నా ఆలోచనలకు. నా భర్తకు సుఖశాంతులనిచ్చే సరితను చూచి ద్వేషించక స్వంత చెల్లెలిగా ప్రేమించే శక్తి ప్రసాదించమ్మా అని మా అత్తగారి ఫోటో దగ్గరగావెళ్ళేదానిని.

సరిత పెండ్లిఐన సంవత్సరానికి నీవు జన్మించావు. నీవు అచ్చు మి నాన్నగారి పోలికే, నిన్ను చూచి మి అమ్మ ఎంతో సంబరపడినది. నీవు ఈ ప్రపంచములో అడుగిడిన సమయములో మీ అమ్మ కంటే, వారికంటే ఎక్కువగా ఆనందించినది నేను. ఒంటరిగా బాధనొందుతున్న నాకు కల్పతరువులా లభించావు నీవు. తర్వాత నాలుగు సంవత్సరాలకు నవత పుట్టినది.

మిమ్మల్ని నేను కన్నపిల్లలుగా చూచుకొనేదాన్ని మీకు అవసరమైన ప్రతి చిన్న విషయము నేనే చూచుకొనేదాన్ని.

మీమీదికంటే వారిపైనే ఎక్కువ ప్రేమ సరితకు అని ఋజూచేసే సంఘటనలు చాలాఉండేవి.

కన్నపిల్లలని ప్రేమించని తల్లులుంటారా. పెద్దమ్మా. అంది నవత.

ఛా ఛా. ఇవేమి మాటలు నవతా, మి అమ్మకు మీమీద పేమ లేకకాదు మీ విషయము పట్టించుకోనిది, వారి ప్రేమలో భాగము పంచుకున్న మీ అమ్మ. ఆ కొరత నాకు కనిపించకుండా పిల్లలులేని నేను పరిపూర్ణమైన మీ ప్రేమ, తల్లిగా నేను పొందాలని మీకు దూరముగా ఉండేది, అన్నది గాద్గదికంగా.

దీనికి మనుష్యుల విలువ తెలవదు పెద్దమ్మా. ఎంత నోటికి వచ్చిన అంతే మాట్లాడుతుంది" అన్నాడు ప్రవీణ్.

సునీతమ్మ మౌనముగా కూర్చున్నది. అన్నయ్యను కోపగించనందుల్లకు పెద్దమ్మమీద విసుగుచేత నీవు చెప్పడము పూర్తిచెయ్ పెద్దమ్మా, అన్నది నవత.

సునీతమ్మ తిరిగి చెప్పడము ప్రారంభించింది.

నవత పుట్టిన కొన్ని రోజులకే సరిత అదృష్ట రేఖ వక్రించింది. మీ అమ్మ సుఖముగా ఉండడము ఆ భగవంతుడు సహించలేక పోయాడో లేక మన వంశములో కోడళ్ళు అశాంతిచేత అలమటించి పోవాలని ఎవరైన శపించారో, సరితపై వారికి ప్రేమ సన్నగిల్లింది. ఎప్పుడూ ఎవరో అమ్మాయిలు వచ్చేవారు మి నాన్నగారి దగ్గరికి. అస్తమానము అమ్మాయిల అందచందాలను గురించి వర్ణించేవారు మీ నాన్నగారు.

మీ అమ్మకు కోపము జాస్తి. "అమ్మాయిలెవ్వరూ మన యింటికి రావద్దు. మేమిద్దరమున్నా సరిపోవడములేదా?" అని నిలదీసి అడిగేది. ఏ విషయములోనైనా వారిని నిలదీసి అడిగేధైర్యము మా కెవ్వరికిలేదు, ఆ ధైర్యము ఒక్క మీ అమ్మకే ఉండేది.

ఆమె ఏదైనా అడిగినా వారు వ్యంగ్య సమాధాన లిచ్చేవారు. లేక నిర్లక్ష్యంగా నవ్వేవారు. దానితో అదీ రెచ్చిపోయేది. మాట మాట అనుకునేవాళ్ళు.

రాను రాను ఇంట్లో మీ అమ్మ జీవితము నరక ప్రాయంగా తయారైంది.

"మీరీ విధముగా ఉన్నారంటే మీ పిల్లలు అడుక్కు తినాల్సివస్తుంది." అన్నది వారితో, అలా గైనా మీ నాన్న మారుతారేమోననే ఆశతో.

"ఎందుకు? వాళ్ళ నాన్న చనిపోయాడా? వాళ్ళు అడుక్కుని తినడానికి?" అన్నారు వారు నిర్లక్ష్యంగా.

ఆరోజు మీ అమ్మ ఎంత ఏడ్చిందో చెప్పలేను. వారి దగ్గర మీమాట చెప్పడమే మానేసింది,

వారి ప్రవర్తనలో మార్పేమిలేదు ఓరోజు మీ అమ్మ నాన్న భోజనము చేస్తున్నారు నేను వడ్డిస్తున్నాను. ఇంతలోకే నవత లేచి ఏడ్పు మొదలుపెట్టింది, నేను వెళ్లి జోకొట్టి దానిని మళ్ళి పడుకోబెట్టి వంటింట్లోకి వచ్చాను, "మీకు స్థిరత్వమనేది లేదా? ప్రేమ అంటూ ఎంతమందిని ప్రేమిస్తారు"? అంటూంది మీ అమ్మ ఏడుస్తూ వారితో.

మీ అమ్మ మాటతో చలించిపోయాను నేను. "అసలు నేను నిన్ను ప్రేమించనేలేదు. అదంతా భ్రమ మాత్రమే. విరిగిన మనస్సులు అతుకుట కష్టము. మనిద్దరము కలిసి జీవించడము కుదరదు. నీవు నీ యిష్టమువచ్చిన చోటికివెళ్లు అన్నారు వారు,

"మనము కలిసి జీవించడము కుదరదా? ఐతే నన్ను ఇల్లువదలి వెళ్ళమంటారా?" అంది మీ అమ్మ కోపముచేత. మనిషిఆపాదమస్తకము వణికిపోతుంది.

"నేను సుఖముగా ఉండాలని నీకు ఉన్నట్లైనా నీవు ఇల్లు వదలి వెళ్ళవలసినది. అన్నారు మీ నాన్న గారు, ఆరోజంతా ఏడుస్తూనే కూర్చుంది మీ అమ్మ. ఎంత బ్రతిమాలిన పచ్చిమంచినీళ్ళు కూడా ముట్టలేదు ఆ ఇంట్లో,

మరునాడు ఉదయము నా దగ్గరగావచ్చి "నేను వెళ్తున్నాను అక్కయ్యా" అన్నది. ఏడ్చి ఏడ్చి కళ్ళు వాచిపోయినవి, ముఖమంతా పీక్కుపోయింది. దానిని చూడగనే నాగుండె తరుక్కుపోయింది.

"ఎక్కడికి వెళ్తావు? వారేదో కోపములో అన్నారు. అంతమాత్రానికే ఇల్లు విడిచి వెళ్ళాలా?" అన్నాను.

"కోపములోకాదు అక్కయ్యా. నిజంగానే వెళ్ళమన్నారు, నేనిక్కడున్న వారికి సుఖము లేదు కదా నేను వెళ్తాను." అన్నది ధృడనిశ్చయమైన గొంతుతో.

"ఎక్కడికి వెళ్తావు?"

"నాలాటి నిర్భాగ్యురాలికి ఆశ్రయమిచ్చే దాతలే కరువయ్యారా అక్కయ్యా నేను అన్నయ్య దగ్గరకు వెళ్తాను" అన్నది.

"బాగుగా ఆలోచించుకో సరితా. చిన్న చిన్న విషయాలకు మాటపట్టింపులు మంచివికావు" అన్నాను, ఆమె నామాట వింటుందనే నమ్మకము లేదునాకు. వారంతే. సరితా అంతే. వాళ్ళు అనుకున్నట్లుగానే జరగాలి ప్రతిపని, ఎదుటివాళ్ళ మాటను ఖాతరు చేయరువాళ్ళు.

"ఆలోచించేదేమున్నదక్కయ్యా. వారు ఇంటి యజమానులు. వెళ్లిపొమ్మన్నారు వెళ్తున్నాను అన్నది గాద్గికంగా.

"మరి పిల్లలు" అన్నాను.

"వారి ప్రేమకు దూరమైనానని తెలిసిన క్షణమే నేను చావాల్సింది. నాది మొండిప్రాణము. నే నింకా జీవించే ఉన్నాను. నాకు జీవించాలనే ఆశలేదు, నా జీవితముపై నాకే ఆశలేనప్పుడు ఎదుటివాళ్ళ నెలా తీర్చి దిద్దిగలనమ్మా. వాళ్ళు నీదగ్గరే ఉండనీ అక్కయ్యా. తల్లిలేని నేను బ్రతుకలేదా? తల్లిలేని వారు జీవించలేరా? వాళ్ళు అలాగే జీవిస్తారు" అంది ఏడుస్తూ.

ఆమెనుచూచి నాకు ఏడుపు ఆగిందికాదు, సరితను పట్టుకునిఏడ్చాను, సరితా నీవు ఈ యిల్లు విడిచి

వెళ్ళడానికి వీలులేదు. నిన్ను విడిచి ఉండలేరు. సరితా" అన్నాను.

"అది ఇప్పుడుకాదు అక్కయ్యా. అదొక్క నాటి విషయము. ఇప్పుడు నేను వెళ్ళక తప్ప దక్కయ్యా. వారి హృదయము సాగరము లాంటిది. సాగర గర్భములో ప్రవేశించినవాడే స్వచ్ఛమైన ముత్యాలను పొందగలుగుతాడు. సాగర గర్భములోకి ప్రవేశించలేనివాడు రిక్త హస్తాలతో వెనుదిరిగివెళ్తారు. నా జీవితము ఈ విధముగానే జరిగినది అక్కయ్యా. నాలోని ఏ లోపమువల్ల నేను వారి హృదయములో పరిపూర్ణముగా చోటు చేసుకోలేక పోయాను. అందుకే నేను వారి హృదయములోనుండి, వారి ఇంటిలోనుండి వెళ్ళగొట్టబడుతున్నాను." అంటూ ఏడుస్తూ వెళ్ళి పోయింది.

సరిత అన్నయ్య దగ్గరకు వెళ్లింది. ఆమె జీవితము ఈ విధముగా జరిగినదని అన్నయ్య క్రుంగి పోయారు. అక్కడినుండి వచ్చేసిన నెల రోజులకే జబ్బు పడింది సరిత. డాక్టరు టి. బి. అని తెలియ జేశారు. మనోవ్యాధికి మందేమున్నది.? ఎన్ని మందులు వాడినా వ్యాధి తగ్గలేదు.

నేను అక్కడికివెళ్లి చూచి వచ్చేదాన్ని. ఇంత జరిగినా కూడా ఆమెకు వారిపైనున్న ప్రేమ తగ్గలేదు. అస్తమానము వారి గురించే ఆలోచించేది.

ఓ నాడు వారితో "సరితకు టి.బి. అని డాక్టరు చెప్పారు, మనింటికి తీసుకుని వద్దామా" అన్నాను.

"అవసరములేదు" అన్నారు.

"మంచిది కాని మీరు ఒకసారివెళ్ళి చూచి రండి. మిమ్ములను చూడాలనే కోరికచేత క్రుంగి కృశించి పోతుంది" అన్నాను ధైర్యముచేసి.

"నీవు వెళ్తున్నది చాలక నన్ను వెళ్ళమంటు న్నావా?" అని మండిపడ్డారు.

ఆరోజు నాలో అంత కోపము ధైర్యము ఎక్కడినుండి వచ్చిందో తెలియదు. వారితో వాదించాను.

"అక్కడకు వెళ్ళడము తప్పా ఆమె ఈ ఇంటి కోడలు కాదా ? ఆమెలేనిదే జీవించలేనని చెప్పేరోజులు మర్చిపోయారా? మీ చేతులారా దాన్ని చంపేస్తున్నారు. మీరు వెళ్ళకపోయిన చచ్చినా ఆమె ఆత్మకు శాంతి లభించదు. మీరు వెళ్ళి ఒక్క సారి ఆమెను చూచిరండి" అన్నాను ధైర్యముగా

"చాలదూరము వచ్చిందే వ్యవహారము. నేను వెళ్ళను. నీవు కూడా అక్కడికే వెళ్ళవలసినది. మళ్లీ ఈ ఇంటి చాయలకే రావద్దు. మీరిద్దరు నన్ను సుఖ పెట్టలేకపోయారు. నాకు నా అనేవాళ్ళు ఎవరులేరు. వెళ్ళు అన్నారు కోపముగా.

నాలో మొండి ధైర్యము ప్రవేశించింది. "వెళ్తాను. బాబు ఆటలకివెళ్ళాడు. వాడు రాగానె పిల్లలను తీసుకుని వెళ్తాను" అన్నాను.

"ఏమిటి? పిల్లలను తీసుకువెళ్తావా? వాళ్ళు నా పిల్లలు. వాళ్ళపై మీకెవ్వరికి అధికారములేదు. కావాలంటే మీ అన్నను నా మీద దావా వెయ్యమను" అన్నారు.

"మనుష్యుల అహంకారముఅణచుటకు దావాలె వెయ్యనక్కరలేదు కాలమే వారిని మారుస్తుంది" అని అక్కడి నుండి అన్నయ్య దగ్గరకు వచ్చేశాను.

ఈ విషయాలన్ని తెలుసుకొని క్రుంగిపోయింది సరిత.

"అక్కయ్యా వారు చాల మంచివారు. నవనీతములాటి వారి హృదయము కఠినపాషాణముగా ఎందుకు మారిందో ఊహించలేకున్నాను. నీవు తిరిగి అక్కడికి వెళ్ళు అంది.

నేను మీ ఇద్దరి జీవితములో ప్రవేశించాను. మధ్యలో నిష్క్రమిస్తున్నాను. కాని నా జీవితము

శాలూకు జ్ఞాపకచిహ్నములను వారి వద్దే వదలి వెళ్తున్నాను. అక్కడికి వెళ్ళవలసినది'' అనిఏడ్చింది.

"నీ ఆరోగ్యము బాగుపడ్డాక వెళ్తానని" చెప్పాను,

సరిత ఆరోగ్యము పూర్తిగా క్షీణించింది, సరితను మదనపల్లి తీసుకువెళ్ళాము, నేను అన్నయ్య అక్కడే ఉన్నాము,

మీ మీద బెంగపెట్టుకున్నది. " అక్కయ్యా. నీవు అక్కడున్నట్లయిన వాళ్ళను చూచుకునే దానివి. వాళ్లు ఎలాగున్నారో ? వేళ తప్పక భోజనము చేయుచున్నారో ? " అంటూ వాపోయేది.

డాక్టరు లాభములేదు అనిచెప్పారు. సరితకు సీరియస్‌గా నున్నది. పిల్లల్ని తీసుకుని త్వరగా రావలసినదని రెండుసార్లు వైర్ ఇచ్చాము మీ నాన్నగారికి. కాని వారురాలేదు,

చివరి సారిగా వారిని చూడాలని మీ అమ్మ ఎంత బాధపడిందో చెప్పలేను. అలాంటి దుర్ఘటనలు పగవాళ్ళజీవితములో కూడా సంభవించ కూడదు.

" అక్కయ్యా. పిల్లలు. వారుజాగ్రత్త " అంటూ అన్నయ్య చేతులలో ప్రాణము వదిలింది సరిత. " అంటూ ఎడ్చింది సునీతమ్మ. నవత వెక్కి వెక్కి ఏడుస్తుంది, ప్రవీణ్ ఆడపిల్లలా కన్నీళ్ళు కార్చాడు.

పిల్లల ఏడుపు చూచి భరించలేక పోయింది. సునీతమ్మ. తమకు తాము ఓదార్చుకొని " జరిగినదాని గురించి విచార మెందుకు బాబూ. అంటూ ప్రవీణ్ కన్నీళ్ళు తుడిచింది. నవ్వే. ఊరుకోతల్లి " అంటూ అక్కున జేర్చుకుంది నవతను

కాసేపు ఎవరు ఏమి మాట్లాడ లేకపోయారు.

సునీతమ్మ మళ్ళిచెప్పటం మొదలు పెట్టింది.

మీ అమ్మచని పోయిందని వైర్ ఇచ్చాము. మీ నాన్నగారికి, వారురాలేదు. మిమ్మల్ని పంపలేదు.

అమ్మ, నాన్న అందరూ వచ్చారు. అన్నయ్య ఏడ్చాడు, అక్కడికి వచ్చిన ప్రతి వాళ్ళు కంటతడి పెట్టారు.

పదోరోజు కర్మకు కూడారాలేదు మీ నాన్నగారు. ఆచారము ప్రకారము నైవేద్యము తీసుకుని మీ అమ్మ సమాధి దగ్గరకు వెళ్ళాము,

మీ అమ్మసమాధిపై నుంచిన నైవేద్యమును కాకి ముట్టనేలేదు, దాదాపు రెండుగంటల వరకు వేచియున్నాము. కానిఏఒక్కకాకి కూడారాలేదు, అదేమివింతోకాని అక్కడికి వచ్చేప్రతికాకి భయపడి నట్లు పరిగెత్తి పోతున్నవి.

అక్కడికి వచ్చిన నల్గురు నాలుగు కారణాలు అంటున్నారు. మాకు ఏమిచెయలో పాలు పోవడము లేదు.

ఇదంతా మనదురదృష్టము సునీతా. ఆమె చివరి ఘడియలలోనైనా అమహాను భావుడు పిల్లల్ని తీసుకొని వచ్చిఉంటే ఆమె ఆత్మకు శాంతి లభించేది" అన్నాడు గాద్గదికంగా.

నేను మీ అమ్మ సమాధి దగ్గిర మోకరిల్లి " సరితా, వారు, ఎందువల్ల రాలేకపోయారో. దానికి నేనేమి చేయలేనమ్మా ? అది మన దురదృష్టమనుకోవాలి. నీవు నీపిల్లల కొరకు బాధ పడుతున్నావెమో వాళ్ళ గురించి నీకు దిగులక్కర లేదమ్మా. నే నేవిధముగానైనా వాళ్ళను నా దగ్గరకు తెచ్చు కుంటాను. వాళ్ళను చదివించి ఉన్నత స్థితికి తెస్తాను. నీవులేని కొరత వాళ్ళకెన్నడూ రానివ్వను. నాసొంత పిల్లలుగా చూచుకుంటాను. వాళ్ళను నా రెండు కళ్ళగా భావించి కాపాడు కుంటానని అత్తయ్య మీద ప్రమాణము చేసిచెప్తున్నాను. సరితా. అన్నాను.

అప్పుడు మెల్లిగా ఒ కాకి వచ్చివ్రాలింది, మిగిలిన కాకులన్ని వచ్చి నైవేద్యము తిన్నవి.

చూచావా అన్నయ్యా, ఆమె ఆత్మఎంతగా తపించి పోయిందోనని అన్నయ్యను పట్టుకుని బావురుమన్నాను.

అన్నయ్య ఎంత చెప్పినా వినక ఉద్యోగ ప్రయత్నము చేయడము మొదలు పెట్టాను, అదృష్టవశాత్తు నాకు హైద్రాబాద్ లో ఉద్యోగము దొరికినది.

వారు ఇంటిలో లేని సమయములో వెళ్ళి "పిల్లలను తీసుకు వెళ్తున్నాను" అనిచీటి వ్రాసిమిమ్ములను తీసుకొని ఇక్కడికి వచ్చేశాను, మనల్ని వదలి ఉండలేక మామయ్య ఇక్కడికే వచ్చేశాడు, మీరు వృద్ధిలోకి వచ్చిన నాడే మీ అమ్మ ఆత్మకు శాంతి, నా కృషికి ఫలితము'' అన్నది.

"నాన్నగారు ఎక్కడ ఉన్నారు పెద్దమ్మా అన్నాడు ప్రవీణ్,

మీ అమ్మచని పోయినదని బాధచేత మీ నాన్నగారు దేశాలు పట్టి వెళ్ళలేదు, సన్యాసుల్లో కలవలేదు, నేను మిమ్మల్ని తీసుకుని వచ్చిన తర్వాత అమ్మాయిలు విచ్చల విడిగా వచ్చేవారట, మేమిద్దరము వారిని సుఖపెట్టలేక పోయాము, వాళ్ళెయినా సుఖపెట్టారో లేదో భగవంతునికే తెలియాలి, ఇప్పుడు పెద్దవారై ఉంటారు కదా, రామా, కృష్ణ అంటూ ఇంటి పట్టునే ఉండి ఉంటారు, అన్నాను.

" ఉండి ఉంటారు అంటున్నావు, నీకుతెలియదా? పెద్దమ్మ " అన్నది నవత,

" నాకు తెలియదు. ప్రేమించిన వాళ్ళ జీవితాలు ఎంత సుఖమయముగా ప్రశాంతముగా ఉంటాయో తెలిసిందా ? " అన్నది సునీతమ్మ నవతనుద్దేశించి,

నీ మాట కాదనను పెద్దమ్మా, నీవేలేక పోయిన మేము ఏమైపోయే వాళ్ళమో ఊహించలేము, నీసుఖాన్ని సహితముత్యజించి మా కొరకు పాటుపడ్డావు. నీ ఇష్ట ప్రకారమే నడచు కుంటాను. " అన్నది నవత,

నవత మాటల తోసునీతమ్మ వదనము ప్రఫుల్లమైనది.

" పెద్దమ్మా నాన్నగారు మనకన్యాయముచేశారని, మనము ఆ విధముగానే ప్రవర్తించాలా '' ఇప్పుడు నాన్నగారు పశ్చాత్తాపముతో కుమిలిపోతూండ వచ్చును. ఈ వృద్ధాప్యములో వారిని ఒంటరిగా వదలడము ఏమిభావ్యంగా ఉంటుంది, వారిని మన దగ్గరకు పిలిపించుకుందామా ? అన్నాడు ప్రవీణ్.

' అలాగేబాబు, ఈ సంవత్సరముతో నీ చదువు పూర్తిఅవుతుందికదూ. తర్వాత అక్కడకే వెళ్దాము మనము. అన్నది కన్నీరు వత్తుకుంటూ. చదువులకు, నాన్నగారిని తీసుక వచ్చుటకు సంబంధ మేమిటమ్మా ! నాన్నగారి దగ్గరికి వెల్దాము '' అన్నాడు ప్రవీణ్.

మీ అమ్మ తనలోని ప్రేమనంతా నీలోయిమిడ్చి వెళ్ళిందా ప్రవీణ్ । మీ నాన్నగారిని చూడాలని తహతహలాడుతున్నావ్, నీ ఇష్టప్రకారము రేపేవెల్దాము' అన్నది, ఆవిడ ముఖములో కొన్ని సంవత్సరాల తర్వాత చిరునవ్వు చిందులు వేసింది. బహుశ ఇన్నాళ్ళ తర్వాత భర్తను చూడబోతున్నా ననేసంతోషము చేతకాబోలు'

" నీ వెంత విశాల హృదయు రాలివమ్మా ! నీ వంటి కరుణామయి చేతులలో పెరిగి పెద్దవాళ్ళమౌటమే మా అదృష్టము . " అని ప్రవీణ్ ఆమాతృమూర్తికి వందన మాచరించాడు.

" దీనికంతా మి నాయనమ్మగారి ఆశీర్వాదమే బాబూ ! " అంటూ అత్తగారి ఫోటో దగ్గరికి వెళ్ళి చేతులు జోడించింది సునీతమ్మ. ప్రవీణ్ నవతలు అనుసరించారు వాళ్ళ ముగ్గురిని ఆశీర్వదిస్తున్నట్లుగా ఫొటో పైనున్న హారములోనుండి ఓపువ్వు వచ్చివాళ్ళ చెంత రాలింది.